ధరణి దరఖాస్తులు ఆన్‌లైన్

ఆర్డీఓ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు

మిర్యాలగూడ, జూన్ 14 : మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ధరణి సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను ఆర్డీఓ జి.శ్రీనివాస్ సమక్షంలో సిబ్బంది ఆన్‌లైన్ చేస్తున్నారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డివిజన్ పరిధిలో సుమారు 8,572 దరఖాస్తులు వచ్చాయి. రైతుల భూమి పట్టాదారు పాస్‌పుస్తకాల్లో లేకపోవడం, ఎక్కువ, తక్కువ చూపడం, పేర్లు తప్పుగా ఉండడం, ఉన్న భూమి మాయమవడం, సర్వే నంబర్లు ఉన్నా భూమి లేకపోవడం, సర్వే నంబర్లు తప్పుగా పడడం, నిషేధిత భూములుగా చూపడం వంటి సమస్యలపై ఎన్నికలకు ముందు సుమారు 2వేల మంది రైతులు దరఖాస్తు చేసుకోగా క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి జిల్లా కలెక్టరేట్‌కు పంపించారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో వాటి ఆన్‌లైన్ ప్రక్రియ సాధ్యమ కాకపోవడంతో తిరిగి మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయానికి పంపించారు. శుక్రవారం నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే పనులను ప్రారంభించారు. వారం రోజుల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని ఆర్డీఓ జి. శ్రీనివాస్‌రావు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- గడియారం సెంటర్‌లో రూ.90 కోట్లతో సాంస్కృతిక కేంద్రం నిర్మాణం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి వెంకట్‌రెడ్డి

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 14: రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఐదేండ్లల్లో నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ఫలాలు అందిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల చర్లపల్లికి చెందిన 100 మంది అమ్మాయిలకు ఇటీవల 45 రోజుల్లో సినిమాటోగ్రఫీ నైపుణ్య శిక్షణ కోర్సులో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో మంత్రి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలు నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. నల్లగొండ చుట్టూ ప్రత్యేకంగా 15 కిలోమీటర్ల రింగ్‌రోడ్డు, క్లాక్ టవర్ సర్కిల్ వద్ద రూ.90 కోట్ల ఖర్చుతో సాంస్కృతిక కేంద్రం వంటి ప్రాజెక్టులు త్వరలో రాబోతున్నాయని తెలిపారు. కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లాలో నైపుణ్య అభివృద్ధి కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలకు సినిమాటోగ్రఫీలో నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. స్పేస్ అకాడమీ చైర్మన్ శశి ప్రీతం మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ కాలంలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, అడ్వాన్స్‌డ్ లెర్నింగ్, కెరీర్ కౌన్సెలింగ్‌లో సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ చందనా దీప్తి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నటుడు వైభవ్ సూర్య, స్థానిక సంస్థల అవనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి, డీఆర్డీఏ పీడీ నాగిరెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వర్‌రావు, ఆర్డీఓ రవి పాల్గొన్నారు.

వనరుల ఆధారంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

నల్లగొండ జిల్లాలో అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో వీ హబ్ ద్వారా జిల్లాలో నైపుణ్యాల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చర్చించారు. జిల్లాలో నిమ్మ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి, మట్టి కుండలు, బాటిళ్ల తయారీకి అవకాశాలు ఉన్నాయని, ఇతర రంగాల్లో నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. మునుగోడులో తాటి బెల్లం తయారీ, ఇతర ఉత్పత్తుల తయారీకి ప్రణాళిక రూపొందించాలని, జిల్లా కేంద్రంలో నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన కేంద్రాన్ని ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరలో పరిష్కరిస్తాం

- కలెక్టర్ హరిచందన

మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, జూన్ 14: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని, డేటా కరెక్షన్‌కు సంబంధించిన దరఖాస్తులను 15 రోజుల్లో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. శుక్రవారం ధరణి, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లాకు సంబంధించి ధరణి పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ ఆయనకు వివరించారు. కోర్టు కేసులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కొన్ని దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో తనిఖీ పూర్తి చేశామని, సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ విషయమై ప్రతిరోజు ఆర్డీఓలు, తాసీల్దార్లతో సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ధరణితో పాటు ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సైతం త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా నవీన్ మిత్తల్ కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీఓలు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంటున్న డీఎస్పీ శివరాంరెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

నీలగిరి, జూన్ 14 : రాష్ట్ర స్థాయిలో అత్యధికంగా రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు గాను నల్లగొండ రెడ్‌క్రాస్ సొసైటీకీ రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. శుక్రవారం రాజ్‌భవన్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ సెక్రటరీ, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ బుర్ర వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి, జిల్లా యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. దాంతో పాటు రెడ్‌క్రాస్‌కు అత్యధిక యూనిట్ల రక్తాన్ని అందించిన కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ బ్లడ్ మోటివేటర్ గుమ్ముల మోహన్‌రెడ్డికి, అత్యధిక సార్లు బ్లడ్ క్యాంపులు నిర్వహించిన జిల్లా పోలీస్ శాఖ తరపున నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, అత్యధిక సార్లు రక్తదానం చేసిన ఎం. ప్రభాకర్‌రావు, ఎన్జీ కళాశాల ఎన్‌సీసీ కోఆర్డినేటర్ సుధాకర్‌కు అవార్డు లభించింది.

రుణపరిమితి పెంచి రైతులకు కొత్త రుణాలివ్వాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

మిర్యాలగూడ, జూన్ 14 : స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రుణ పరిమితిని పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అవంతీపురం కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం బ్యాంక్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పంట పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వక పోవడంతో రైతులు ప్రైవేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయించి అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.2లక్షల రుణమాఫీ రైతులందరికీ వర్తించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, పోలెపల్లి గోవిందరెడ్డి, కోట శ్రీనివాస్‌రెడ్డి, చౌగాని వెంకన్న, వీరారెడ్డి, నాగేశ్వర్‌రావు, లింగయ్య, ఆశీర్వాదం, రవి, సైదులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

నారాయణ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 14: పట్టణంలోని నారాయణ పాఠశాలలో విద్యార్థుల నుంచి ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, అడ్మిషన్ ఫీజుల రూపంలో పెద్ద మొత్తంలో డబ్బులు వసూ లు చేస్తున్నారని, ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. పుస్తకాలు నిల్వ ఉంచిన గదిని విద్యాశాఖ అధికారులతో సీజ్ చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యా దోపిడిని అరికట్టక పోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, తాళ్లపల్లి సురేశ్, అర్లపూడి శ్రీను, చిలకల మురళీయాదవ్, సిద్ధం రాజు, గంగాధర్, ఉపేందర్, నరేశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరొకరికి గాయాలు

తిప్పర్తి, జూన్14 : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందగా.. మరొకరు గాయపడిన ఘటన మండలంలోని రాజుపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లొకాని మట్టయ్య కుమారుడు లొకాని అభివర్మ (19) తమ పొలానికి నీటిని అందించేందుకు స్థానిక గంగన్నపాలెం చెరువులో మోటరు దింపేందుకు పెదనాన్నా రామనాథంతో కలిసి వెళ్లాడు. వారు చెరువులోకి దిగి మోటరును నీటిలో వేస్తుండగా.. ఇతర రైతులకు చెందిన మోటర్లు రన్నింగ్‌లో ఉండడంతో నీటిలో విద్యుత్ సరఫరా జరిగి విద్యుదాఘాతానికి గురై అభివర్మ అక్కడికక్కడే మృతి చెందాడు. రామనాథం తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. అభివర్మ బెంగుళూరులో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా.. సెలవులకు ఇంటికి వచ్చాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూసిన స్థానికులు సైతం కంటతడి పెట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్స్ పోయినవి

బీసంగి నాగమణి W/o. యాదయ్య, R/o. H.No.2-80, 14th వార్డు, మర్రిగూడ, నల్లగొండ టౌన్ మరియు జిల్లా, నాకు సంబంధించిన మర్రిగూడలో గల ప్లాటు నెం.4, సర్వే నెం.215, Ext.185 Sq.Yds, 154.68Sq.Mts, Doc.No.2781/2019 గల ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఆన్నెపర్తి నుండి నల్లగొండకు ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినవి దొరికినవారు సంప్ర||9985438065. NLG-

గుమస్తాలు, అకౌంటెట్లు కావలెను

రాంలక్ష్మణ్ పారాబాయిల్డ్ మిల్లులో పనిచేయుటకు అర్హులైన గుమస్తాలు, అకౌంటెంట్లు (పురుషులు, స్త్రీలు) కావలెను. ఆసక్తి కలిగినవారు 9912457999, 9848039579, 7842621631 నెంబర్లకు సంప్రదించగలరు. NLG-

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

పోటీ పరీక్షలు పూర్తయ్యే వరకు స్టడీహాల్ కొనసాగింపు

నకిరేకల్, జూన్ 14 : పోటీ పరీక్షలు పూర్తయ్యే వరకు వాసవీ కళాశాలలో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్, వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత స్టడీహాల్ కొనసాగిస్తామని నిర్వాహకులు బ్రహ్మదేవర నరేశ్, కందగట్ల సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 500 రోజులుగా ఉచిత స్టడీ హాల్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ చదువుకున్న వారు పోలీస్ కానిస్టేబుల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, గ్రూప్ 4, గురుకులం, నర్సు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారు దీనిని వినియోగించుకోవాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

అడవిదేవులపల్లి, జూన్ 14: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన ఘటన అడవిదేవులపల్లి గ్రామ శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఎండీ. జిలాని తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పచ్చిపాల లక్ష్మీనారాయణ(30) అదే గ్రామానికి చెందిన తుమ్మల ఏడుకొండలు ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కిరాయి నిమిత్తం ట్రాక్టర్‌తో త్రిపురారం గ్రామానికి వెళ్లి తెల్లవారుజామున 5 గంటలకు ముదిమాణిక్యం తిరిగి వస్తుండగా అడవిదేవులపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ టైరు రోడ్డుపక్కన ఉన్న రాయి పైకి ఎక్కడంతో ట్రాక్టర్, ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడ్డాయి. దాంతో ట్రాక్టర్ నడుపుతున్న లక్ష్మీనారాయణ కింద పడగా ట్రాక్టర్ టైరు అతడి పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి పచ్చిపాల సోడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి మరొకరు..

మిర్యాలగూడ/దామరచర్ల, జూన్ 14: బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామానికి చెందిన జింకల సైదులు (45) కూతురును ప్రసవం కోసం మిర్యాలగూడ ఏరియా దవాఖానాలో చేర్పించారు. శుక్రవారం ఆమె డెలివరీ కాగా పరామర్శించిన అనంతరం బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. కొత్తగూడెం గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడిపోగా తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేశ్ ఘటనాస్థలానికి వెళ్లి పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మిర్యాలగూడ, జూన్ 14: పట్టణంలోని 33 కేవీ ఫీడర్ లైన్ మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు మిర్యాలగూడ సబ్‌స్టేషన్ నుంచి 11కేవీ అశోక్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు కె.వెంకట్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు : ఏఓ

హాలియా, జూన్ 14 : ఫర్టిలైజర్ దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని అనుముల మండల వ్యవసాయ అధికారి సరిత హెచ్చరించారు. శుక్రవారం హాలియా మున్సిపాలిటీలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత, ధరల విషయంలో అక్రమాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదు ఇవ్వాలన్నారు.

అందని ఆయుర్వేద వైద్యం

- రెండేండ్లుగా భర్తీ కాని డాక్టర్ పోస్టు


అయిటిపాముల ఆయుర్వేద వైద్యశాలలో వైద్యుడు లేక ఖాళీగా ఉన్న కుర్చీ

కట్టంగూర్, జూన్ 14 : దేశీయ వైద్య విధానాలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్యశాలలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. నకిరేకల్ మండలం చిత్తలూరి గ్రామంలో ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో సరైన వసతులు లేకపోవడంతో అప్పటి డాక్టర్ రామాంజాచారి 2002లో ఆస్పత్రిని కట్టంగూర్ మండలం అయిటిపాముల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలోకి మార్చారు. సదరు డాక్టర్ వేరే ప్రాంతానికి వెళ్లగా కొత్తగా మరో డాక్టర్‌ను నియమించలేదు. దాంతో రెండేండ్లుగా డాక్టర్ లేకపోవడం, మందుల కొరత కారణంగా దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య తగ్గిపోయింది. కేవలం అటెండర్, ఫార్మసిస్టు మాత్రమే దవాఖానకు వచ్చిన రోగులను పరీక్షించి మందులు ఇస్తున్నారు. గ్రామంలో ఆస్పత్రి ఉన్నా తమకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎంపీడీఓ శేషగిరిశర్మ

యాద్గార్‌పల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శేషగిరిశర్మ

మిర్యాలగూడ, జూన్ 14 : గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శేషగిరిశర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని యాద్గార్‌పల్లి, అవంతీపురం, బాదలాపురం, సుబ్బారెడ్డిగూడెం, జాలుబావితండా గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ మిషన్ భగీరథ జలాలపై సర్వేను పరిశీలించారు. గ్రామాల్లో మిషన్‌భగీరథ నల్లాలు లేని వారు గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నంబర్ అందిస్తే కొత్త నల్లా కనెక్షన్ ఇస్తామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీటిని దుర్వినియోగం చేయవద్దని సూచించారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ వీరారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా బుడియబాపు పెద్ద పూజ

ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూన్ 14: మండలం రంగుండ్ల గ్రామంలోగల బుడియబాపు ఆలయంలో శుక్రవారం పెద్ద పూజ పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ర్టాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం పీఠాధిపతి ఆంగోతు భగవాన్‌నాయక్, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

- ఏడీఏ నాగమణి

ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ పోరెడ్డి నాగమణి

మాడ్గులపల్లి, జూన్ 14 :ఫర్టిలైజర్ దుకాణాదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని ఏడీఏ పోరెడ్డి నాగమణి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. నాణ్యత లేని విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనా ధరలు, స్టాక్ వివరాలను షాపుల ఎదుట ప్రదర్శించాలని సూచించారు. ప్యాకింగ్ లేకుండా లూజుగా ఉన్న విత్తనాలను, గడువు ముగిసిన వాటిని రైతులు కొనుగోలు చేయవద్దని, విత్తనాలు కొన్నప్పుడు తప్పకుండా రసీదు తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఓ సైదానాయక్ ఉన్నారు.

ఫ్యామిలీ సర్వేపై అధికారుల సమీక్ష

చిట్యాల, జూన్ 14 : గ్రామాల్లో నిర్వహిస్తున్న హెల్త్‌కార్డుల ఫ్యామిలీ సర్వేపై మానిటరింగ్ కమిటీ శుక్రవారం మండలంలోని గుండ్రాంపల్లి హెల్త్ సబ్‌సెంటర్‌లో సమీక్ష నిర్వహించింది. గుండ్రాంపల్లి సబ్‌సెంటర్ పరిధిలోని గుండ్రాంపల్లి, సుంకెనపల్లి, ఏపూరు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మహిళా సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేపై డీడబ్ల్యూఓ సక్కుబాయి, సీడీపీఓలు జ్యోతి, కవిత పలు సూచనలు చేశారు. అంగన్ వాడీల్లో కుటుంబాల నమోదు సంఖ్య, విలేజ్ హెల్త్ రిజిష్టర్‌లో నమోదు సంఖ్య మధ్య తేడాలను సరిచేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు ప్రభావతి, రోజా, పారిజాత, డీసీ సతీశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాలను ప్రజలే అభివృద్ధి చేసుకోవాలి

- చిన జీయర్ స్వామి

బొర్రాయిపాలెంలో సింహద్వారం ప్రారంభోత్సవంలో పాల్గొన్న చిన జీయర్‌స్వామి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

త్రిపురారం, జూన్ 14 : ప్రాచీన దేవాలయాలను ఆయా గ్రామాల ప్రజలే అభివృద్ధి చేసుకోవాలని త్రిదండి చిన జీయర్ స్వామి సూచించారు. శుక్రవారం మండలంలోని బొర్రాయిపాలెం గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ప్రధాన సింహద్వారాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొర్రాయిపాలెం, అన్నారం గ్రామాలకు చెందిన అంబటి వెంకట్‌రెడ్డి పద్మ, సైదిరెడ్డి నాగలక్ష్మి, నాగిరెడ్డి వసంత, కాంతారెడ్డి గోవిందమ్మ దంపతులు రూ.6.50 లక్షలతో సింహద్వారం నిర్మించడం అభినందించదగ్గ విషయమన్నారు.అతి పురాతన వేంకటేశ్వరస్వామి, అనంత పద్మనాభస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలు ఒకేచోట ఉండడం ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ బిట్టు వసంతరవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, కుందూరు సుమతీజానారెడ్డి, డీసీసీ అధక్షుడు శంకర్‌నాయక్, ఎంపీపీ అనుముల పాండమ్మాశ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ భారతీభాస్కర్‌నాయక్, నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, నాయకులు లింగారెడ్డి, ముడిమల్ల బుచ్చిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు

మిర్యాలగూడ : పట్టణంలోని సీతారాంపురంలో గల శ్రీకృష్ణ దేవాలయంలో శుక్రవారం చిన జీయర్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ రెండో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బండారు కుశలయ్య, భక్తులు పాల్గొన్నారు,

ఎన్ఎంఎంఎస్‌కు ఆదర్శ విద్యార్థులు

కోడి వెంకట్

చిన్మయి

నిడమనూరు, జూన్ 14 : ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు కేంద్ర ప్రభు త్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లోగిశెట్టి రంజిత తెలిపారు. గత డిసెంబర్‌లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో పాఠశాలకు చెందిన కోడి వెంకట్, కొంగరి చిన్మయి ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నా రు. వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.12 వేల ఉపకార వేతనం అందించనున్నట్లు తెలిపారు. ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీడీఓ కరుణాకర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి, జూన్ 14 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ పి.కరుణాకర్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. వానకాలంలో ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షం కురిసే సమయంలో చెట్లపై పిడుగులు పడే ప్రమాదం ఉంటుందని, ప్రజలు చెట్ల కిందికి వెళ్లకూడదని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు అందని వారు గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకుంటే కొత్త నల్లా కనెక్షన్ ఇస్తామన్నారు. ఆయన వెంట ఎంపీఓ మోసీన్ బిన్ అహ్మద్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఎంపీపీ సునీత

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

వేములపల్లి, జూన్ 14 : మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ పుట్టల సునీత కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వర్షాకాలంలో రైతులకు అవసరమై విత్తనాలను అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, పీఏసీఎస్ చైర్మన్ జడ రాములుయాదవ్, ఎంపీడీఓ శారదాదేవి, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండలాధికారులు పాల్గొన్నారు.

అవయవ దానం

ముప్పిపల్లి శ్రీనివాస్(ఫైల్)

గుర్రంపోడ్, జూన్ 14: తాను చనిపోయినా తన అవయవాల ద్వారా నలుగురికి ప్రాణం పోశాడు మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన ముప్పిపల్లి శ్రీనివాస్. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ 20 ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లి కేబుల్ నెట్‌వర్క్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 9న బైక్‌పై ఇంటికి వెళ్తుండగా రోడ్డుపై ఉన్న బారికేడ్‌కు తగిలి కింద పడ్డాడు. తల వెనుక భాగంలో బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా చికిత్స అందించినప్పటికీ పరిస్థితి మెరుగు పడలేదు. శుక్రవారము సాయంత్రం శ్రీనివాస్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అతడి అవయవాలను దానం చేసేందుకు భార్య రేణుక, కుటుంబ సభ్యులు అంగీకరించడంతో జీవన్‌దాన్ సంస్థ సభ్యులు కిడ్నీలు, కళ్లు, లివర్, ఊపిరితిత్తులను సేకరించారు.